క్లుప్తంగా

నేడు అల్లూరి జయంతి వేడుకలు

మురళీనగర్: విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గురువారం మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు జగ్గారావు బ్రిడ్జి వద్ద శివాలయం ముందున్న రహదారిలో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ మార్గం బాగా శిథిలం కావడంతో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ సీసీ రోడ్డు నిర్మాణం కోసం గతంలో రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించారు. బుధవారం రోడ్డు పనులు పూర్తవగా.. కార్పొరేటర్ ఉషశ్రీ పరిశీలించారు.

వృద్ధుడి అదృశ్యం



బొనుగు శౌర్య

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బొనుగు శౌర్య అనే వృద్ధుడు జ్ఞానాపురంలో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. గత నెల 29న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరుకోలేదు. అంతటా వెతికినా ఆచూకీ తెలియరాలేదు. ఈ వృద్ధుడుకి మతిమరపు ఉందని, ఆరోగ్యం కూడా బాగులేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వృద్ధుడి భార్య ఆంథోనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ బి.నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు మొక్కను అందజేస్తున్న కేజీహెచ్, చెస్ట్ హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు శివానంద్, సునీల్

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, టీబీ, చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. కొద్దిసేపు ఎమ్మెల్యేతో వారు చర్చించారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ముందుగా ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారికి గణపతి పూజ చేసి, భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. పంచామృతాభిషేకం అనంతరం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పసుపుతో అలంకరించి హారతులిచ్చారు. ప్రత్యేక పూజలు, జలాభిషేకం కోసం ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్



క్రౌన్ బేకరీ ఎదురుగా 80 ఫీట్ రోడ్‌లో వాహనాల రాంగ్ పార్కింగ్



రోడ్డును ఆక్రమించిన పార్సిల్ సంస్థ వాహనాలు



80 ఫీట్ రోడ్డులో బ్రిడ్జిని ఆక్రమించి డంప్‌చేసిన పార్సిల్స్

- 80 ఫీట్ రోడ్డులో ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

సీతంపేట: ప్రధాన రహదారులు వాహనాల రాంగ్ పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయాయి. ఇటు ట్రాఫిక్ పోలీసులు.. అటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో రహదారులను ఆక్రమించి ఇష్టానుసారంగా వాహనాలను నిలిపివేస్తున్నారు. ఖాళీగా రోడ్డు కనిపిస్తే చాలు వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మార్చుకుంటున్నారు. జీవీఎంసీ 26వ వార్డు శంకరమఠం రోడ్‌లో క్రౌన్ బేకరీ ఎదురుగా ఉన్న 80 అడుగుల రహదారిని పూర్తిగా ఆక్రమించి వావానాలను నిలిపివేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్‌తో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే వీలు లేకుండా పోయింది. ఈ మార్గంలో ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఏళ్ల తరబడి రాంగ్ పార్కింగ్‌తో ఇబ్బందులు పడుతున్నారు.



ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన నో పార్కింగ్ బోర్డు

కొరవడిన ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ

క్రౌన్ బేకరీ ఎదురుగా ఉన్న 80 ఫీట్ రోడ్‌ను నో పార్కింగ్ జోన్‌గా ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. ఈ రహదారిలో వాహనాలు పార్క్‌చేయరాదని, అక్రమంగా వాహనాలు నిలిపితే రూ.1,035 జరిమానా విధిస్తామని నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేశారు. రాంగ్ పార్కింగ్ నిరోధించడానికి బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు. ఏ రోజూ అక్రమ పార్కింగ్‌పై దృష్టి పెట్టింది లేదనే చెప్పాలి. దీంతో ఎక్కడెక్కడ నుంచి తెచ్చిన కార్లను ఇక్కడ రోజులు, వారాల తరబడి నిలిపివేస్తున్నారు.

రోడ్డును ఆక్రమించిన ప్రైవేటు కార్యాలయం

80 ఫీట్ రోడ్ చివర ఏర్పాటు చేసిన ఒక ప్రైవేటు పార్సిల్ కార్యాలయం వారు తమ సరకు రవాణా వాహనాలతో రోడ్డును ఆక్రమించారు. వివిధ ప్రాంతాల నుంచి పార్సిల్స్ రోడ్డుపైన, అక్కడ గెడ్డపై ఉన్న బ్రిడ్జిపైన డంప్‌చేస్తున్నారు. తన వ్యాపారానికి రోడ్డును, బ్రిడ్జిని అడ్డాగా మార్చుకున్నారు. పబ్లిక్ రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్నా.. ఇప్పటి వరకు ఏ అధికారి వారిపై చర్యలకు ఉపక్రమించలేదు. పార్సిల్ సంస్థతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ వాసులు ఇబ్బంది పడుతున్నారు. 80 అడుగుల రోడ్‌లో రాంగ్ పార్కింగ్‌ను, ఆక్రమణలను నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన కలెక్టర్‌కు అభినందనలు

మహారాణిపేట: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.ఎన్.హరేంధ్రప్రసాద్‌ను సర్వేయర్ ఎంప్లాయీస్ అసోసియేషన్స్ జిల్లా అధ్యక్షుడు, భీమిలి ఆర్డీవో ఆఫీసు డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ పంపాన కనకబాబు ఆధ్వర్యంలో సర్వేయర్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. సర్వేయర్లు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల అభినందన..

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధ్రప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిసి అభినందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ ఆర్ఎస్ రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ రాజేంద్రవర్మ, జిల్లా కోశాధికారి రాజేష్, సిటీ అధ్యక్షుడు యోగి, కార్యదర్శి రవిశంకర్, సుధీర్, సురేష్, కోటి, సిద్ధార్థ, త్రినాథ్, సుధాకర్, చంద్రశేఖర్, రాజు తదితరులు ఉన్నారు.



కలెక్టర్ హరేంధ్ర ప్రసాద్‌ను అభినందిస్తున్న ఏపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ తదితరులు

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

కలెక్టర్ ఎం.ఎన్. హరేంధ్రప్రసాద్‌ను జిల్లా నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సహాధ్యక్షుడు ఎల్.కోటేశ్వరరావు, రెడ్డి వరలక్ష్మి, విద్యాధర్, రమేష్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

సీతంపేట: డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమ కాటు ద్వారా సంక్రమించే డెంగ్యూ జ్వరం నుంచి రక్షణ పొందాలని సూచించారు. వారం రోజులు దాటి నీటి నిల్వలుంటే దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారుతాయని, దోమల కట్టడికి ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దీనికి సంబంధించి పలు నినాదాలతో ర్యాలీ చేశారు. జిల్లా మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ ఎల్.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈస్ట్ పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్ ఈస్ట్ పార్కులో పలు అభివృద్ధి పనులకు బుధవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందన్నారు. గంజాయి బారిన పడిన యువకులను గుర్తించి, డీ–అడిక్షన్ కేంద్రాలకు తరలించి, వారిని మెరుగుపరచే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రూ.39.76 లక్షలతో ఈస్ట్ పార్కులో వాకింగ్ ట్రాక్, అదనపు టాయిలెట్లు వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పార్కులో మొక్కలు నాటారు. రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయన్నారు. ఎలక్షన్ కోడ్ రావడం వల్ల ముందుకు సాగలేదని, మళ్లీ పనులు మొదలు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. పార్టీలకు అతీతంగా వార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, వార్డు ప్రెసిడెంట్లు, ఈస్ట్ పార్కు ప్రెసిడెంట్, సెక్రటరీ తదితర సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే చర్చ

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు పట్టాభిరెడ్డి తోటలో స్థానిక ప్రజలను బుధవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కలిశారు. స్థానికుల వినతి మేరకు రహదారి పక్కన టీ షాపులో ఆయన వారితో కలిసి టీ తాగుతూ సమస్యలపై చర్చించారు. ప్రజలు, నాయకులు స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సుదర్శన్ పార్కు కమిటీ సలహాదారుడు, న్యాయవాది జె.పృథ్వీరాజు, జనసేన ఉత్తర నాయకుడు సంకు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సుప్రసిద్ధ రచయిత బలివాడ



మాట్లాడుతున్న రచయిత వేణు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కవి సమ్మేళనంలో వైవిధ్యభరితమైన కవితలు చదివి అందరినీ అలరించారు. రచయిత బలివాడ కాంతారావు జయంతి సందర్భంగా డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ తెలుగు నవల, కథా సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని సృష్టించుకున్న సుప్రసిద్ధ రచయిత బలివాడ కాంతారావు అని పేర్కొన్నారు. బాల్యంలోనే స్కూల్ మ్యాగజైన్‌కు సంపాదకుడిగా పనిచేసిన ఘనత ఆయనదని తెలిపారు. బలివాడ 38 నవలలు, 400 వరకు కథలు, 5 నాటికలు, మరెన్నో రేడియో నాటికలు రాశారన్నారు. నిజాయితీ, నిక్కచ్చితనం, జాలి, దయ, కరుణ ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించేవని చెప్పారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు వారు గర్వించదగ్గ రచయిత బలివాడ కాంతారావు అని కొనియాడారు. రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సిహెచ్.సిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.వి.ఎస్.మూర్తి, పి.వి.ఆర్.కుమార్, పరమేశ్వరరావు, బి.రాధారాణి, సురేష్ తదితరులు కవితలు చదివి వినిపించారు.

కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి

కంచరపాలెం: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం కంచరపాలెం రైతుబజారులో కూరగాయల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకం, పందిరి కూరగాయల సాగు, మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగుపై రాయితీల కోసం వివరించారు. పందిరి మీద కూరగాయలు పెంచడం వల్ల లాభాలు వస్తాయన్నారు. కూరగాయల విత్తనాలు కొనేటప్పుడు క్యాష్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి జి.సోని, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రసాద్‌కు సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రసాద్ మారెళ్ల

సీతంపేట: డాక్టర్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన వరల్డ్ కాన్ఫరెన్స్‌లో నగరానికి చెందిన డాక్టర్ ప్రసాద్ మారెళ్ల నేషనల్ సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశాలకు చెందిన సుమారు వెయ్యి మంది వైద్యులు పాల్గొన్నారు. ఇండియాతో పాటు దుబాయ్, ఇటలీ, సింగపూర్ వంటి దేశాల నుంచి రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. ఆర్థో, కార్డియో, న్యూరో, స్పోర్ట్స్ రిహాబిలిటేషన్ తదితర అంశాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. అపోలో కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హన్నా రాజశేఖర్, పీఎఫ్ఐ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.ప్రసాద్ చేతుల మీదుగా డాక్టర్ ప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ, ఉచిత వైద్య శిబిరాలు, కరోనా సమయంలో అందించిన వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

చెత్తను వేరు చేసి అందించండి



స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీలో పాల్గొన్న సచివాలయం, శానిటేషన్ సిబ్బంది, విద్యార్థులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్‌లోని షిర్డీసాయి స్కూల్ వద్ద బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ శానిటేషన్ సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతీ రోజు చెత్తను వేరు చేసి ఇంటింటికీ వచ్చే జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. చెత్తను ఎరుపు, పచ్చ, నీలం రంగు డస్ట్‌బిన్లలో వేరు వేసి వేయాలని వివరించారు. సచివాలయ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సూపర్‌వైజర్, షిర్డీసాయి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలతోనే డెంగ్యూ నివారణ



జిల్లా అధికారులకు సూచనలిస్తున్న స్టేట్ మలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

డాబాగార్డెన్స్: రానున్న వర్షాకాలంలో డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్టేట్ మలేరియా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం జిల్లా అధికారులను ఆదేశించారు. నగరంలో డెంగ్యూ ప్రభావిత ప్రాంతాలైన జబ్బరితోట, రంగిరీజు వీధి ప్రాంతాల్లో బుధవారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించారు. డెంగ్యూ జ్వర బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే ఈడిస్ దోమల నియంత్రణకు చేపడుతున్న యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్, స్ప్రేయింగ్, చికిత్స, అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాల మలేరియా విభాగం అధికారులతో సమావేశమయ్యారు. డెంగ్యూ జ్వరాలను అదుపు చేయడానికి చేపట్టాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా మలేరియా విభాగం అధికారి తులసీరాజ్, జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్ఈవో శేషబాబు, ఇతర మలేరియా విభాగం సిబ్బంది, జీవీఎంసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

సీతమ్మధార: ద్వారకానగర్ 3వ లేన్‌లో గల ఉపాధ్యాయ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ, టెట్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభం అయ్యాయి. జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.సుబ్బిరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని సంస్థ డైరెక్టర్లు అప్పలనాయుడు, దుర్గాప్రసాద్, తిరుపతిరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించబోయే ఉచిత క్లాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఏసుపాదం, గణేష్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 98494 86893 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆధ్యాత్మిక వైభవం

జగన్నాథ స్వామి రథోత్సవాలు అంగరంగ వైభవంగా నేడు ప్రారంభం కానున్నాయి. టౌన్ కొత్త రోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి వారి రథయాత్రకు నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. స్వామి వారి రథోత్సవంలో భాగంగా రోజుకొక అవతారంలో స్వామి భక్తులకు దర్శనం ఇస్తారు. ఆ రూపాలను వీక్షించి భక్తులు తరించిపోతారు.

- నేటి నుంచి జగన్నాథుని రథోత్సవాలు
- ప్రతిష్టా ప్రారంభ సంకల్పం నేడు
- 5వ తేదీ రాత్రి విశేష హోమాలు
- 6న పూర్ణాహుతి, నేత్రోత్సవం, సుభద్రాదేవి శాంతి కల్యాణం
- 7న తొలి రథయాత్ర
- 8 నుంచి స్వామి దశావతారాలు
- 18న తిరుగు రథయాత్ర



జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వామి

డాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం ఈ నెల 4 నుంచి 19 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం జ్యేష్ఠ బహుళ చతుర్దశి సాయంత్రం ప్రతిష్ఠాపన సంకల్పం, 5న అమావాస్య ఉదయం జలాధివాసం, క్షీరాధివాసం, రాత్రి విశేష హోమాలు, పంచ శయ్యాదివాసాలు, 6న ఆషాడ శుద్ధ పాడ్యమి ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరపనున్నారు. 7 ఉదయం 9.20 గంటలకు స్వామిని రథం పైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు జగన్నాథ స్వామి తొలి రథయాత్ర ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 8 నుంచి 17 వరకు టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో దశావతారాల్లో స్వామి భక్తులకు దర్శనమిస్తారు.

స్వామి అవతారాలు..

8న మత్స్యావతారం, 9న కూర్మావతారం, 10న వరాహావతారం, 11,12న నృసింహావతారం, 13న వామనావతారం, 14న పరశురామావతారం, 15న శ్రీరామావతారం, 16న బలరామ.. శ్రీకృష్ణావతారం, 17న తొలి ఏకాదశి, శేషపాన్పు అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తిరుగు రథయాత్ర..

18 ఉదయం 9.15 గంటలకు స్వామిని రథం పైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ చౌల్ట్రీ నుంచి మేళతాళాలు, బాణసంచా, మంగళ వాయిద్యాల నడుమ జగన్నాథుని నామ స్మరణతో వేద పండితుల పారాయణలతో అత్యంత వైభవంగా తిరుగు రథయాత్ర నిర్వహించనున్నారు. 19 ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలో అధిష్ఠింపజేస్తారు.



రథయాత్రకు సిద్ధంగా ఉన్న స్వామి రథం

నిత్య పూజలు..

జూలై 8 నుంచి 17 వరకు నిత్యపూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 వరకు నిత్యపూజ, ఉభయదాతల గోత్రనామాలతో పూజలు, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథ స్వామి ప్రార్థనా గాన సంఘంచే ప్రార్థనా తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకు లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్ర నామ పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9 రోజుల పాటు పాల్గొనాలనుకునే భక్తులు దేవస్థానం కార్యాలయంలో రూ.500 చెల్లించినచో గోత్ర నామాలతో ఆయా రోజుల్లో పూజ జరిపించనున్నారు. దశావతార అలంకరణలు చేయాలనుకునే భక్తులు ముందుగా ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డిని కార్యాలయంలో సంప్రదించవచ్చు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి సీజ్



జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది సంయుక్తంగా పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. రాజస్తాన్‌కు చెందిన పరమేశ్వర్‌జాట్, కమలేష్ వైష్ణవ్‌లను, వేరొక కేసులో ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన రామేశ్వర్‌నాయక్, ప్రతాప్‌నాయక్‌లను తనిఖీలు చేయగా వీరు చెన్నైకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలుసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2.55 లక్షల విలువైన సుమారు 51 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.